# పుత్రగండం

అనగా అనగా ధననాయక రాజ్యాన్ని ఇంద్రవర్మ అనే రాజు పాలిస్తుండే వాడు. ప్రజలంతా సుఖంగా వున్నారని ఆయనే కాకుండా, ప్రజలుకూడా అనుకుని తియ్యటి అబద్ధాలమధ్య ప్రజాశ్రేయస్సు అనే మిధ్యలో హాయిగా వుంటూ వుండే వారు.

మహామంత్రి దేశపతి రాజుగారికి నీడలా వుంటూ ఆయన చేసే ప్రతి పనికి వెనకవుంటూ వుండేవాడు.

తియ్యటి అబద్ధాలమధ్య బతుకుతున్న ప్రజలకి క్రమంగా "తీపి" అంటే విసుగు పుట్టి జీవితం చేదుగా తయారయింది. దేశం కదిలి మరో దేశంలో సుఖంగా బతుకుదామా అని అనుకుని, అది అసాధ్యం కాబట్టి రాజుగార్ని మారిస్తే దేశం మారుతుందేమో అని కలలు కన సాగారు. వీలైతే రాజుగార్ని మార్చమని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకోసాగారు. కానీ దేవుడికి తీరిక లేకపోవడంవల్ల రాజు

## స్వగతంబు

మార్పిడి కార్యక్రమం క్రమంగా వాయిదా పడిపోయింది.

ఇంతలో మహామంత్రి దేశపతికి రాజుగారి సింహాసనం మీద మోజు పుట్ట సాగింది. తాను రాజయితే దేశాన్ని మార్చ లేకపోయినా కొన్నాళ్ళు తానే స్వయంగా పరిపాలించవచ్చనే కాంక్ష బయల్దేరింది. అయితే రాజుగార్ని ప్రజల దృష్టిలో దురాత్ముడ్ని చేస్తే తన పథకం సులువుగా అమలుజరపవచ్చునని అవకాశం కోసం ఎదురు చూడసాగాడు. ఏ విధంగానైనా ఈ రాజుగారు మారి ఎవరైనా సరే రాజైతే కొంత కొత్తదనం వస్తుందని ప్రజలు ఎదురు చూడసాగారు.

ఇది ఇట్లుండ - యువరాజు జయవర్మ తానే కాబోయే రాజుని కాబట్టి పరిపాలనా వ్యవహారాలు చూడడం నేర్చుకుంటే మంచిదని అందరిమీదా అజమాయిషీ ప్రారంభించాడు.

సైనికులమీద, ప్రజలమీద, వ్యాపారస్తులమీద, సేనాధిపతులమీద, మహామంత్రిపైకూడా యువరాజు జయవర్మ జోక్యం కలుగజేసుకోసాగాడు.

యువరాజు వయసులో వుండడంవల్ల, అధికారం అనే ఆయుధం చేతిలో వుండడం వల్ల త్వరలోనే అతని మనసు పక్కదారులు పట్టి మానినీ మద్యాల మధ్య ఇరుక్కుపోయింది.

సదరు సదవకాశాన్ని ఆసరా చేసుకుని మహామంత్రి రాజుగారి మీద దుష్ప్రచారం ప్రారంభించాడు. ఈ రాజుగారు సింహాసనంలో వుంటే యువరాజు ఇలాగే దేశం మీద జులుం చేస్తాడని, వెంటనే రాజుగార్ని సింహాసనం మీద నుంచి దింపి ఇంతవరకూ జరిగిన అన్యాయాలకి అత్యాచారాలకి జవాబుగా యువరాజుతో సహా ఆయన్ని చెరసాలలో బంధించాలని ప్రజల్లో ఒక అభిప్రాయాన్ని కొద్ది రోజుల్లోనే కల్గించగల్గాడు.




తర్వాత ప్రజలు మహామంత్రి దేశపతి అంతరంగాన్ని అర్థం చేసుకోలేక "రాజుగారు డౌన్ డౌన్! యువరాజు డౌన్ డౌన్!" అనే వుద్యమాన్ని ప్రారంభించారు. పర్యవసానంగా మహామంత్రి రాజుగార్ని, యువరాజుని చెరసాలలో బంధించి తానే రాజు అయ్యాడు.

అమాయకులైన ప్రజలు దేశం వెంటనే మారిపోతుందని అనుకున్న కొద్దిరోజుల్లోనే దేశం మారదనీ, మార్చాలని కొత్త రాజుగారు అనుకోవడంలేదనీ, అనుకున్నా ఆ పనీ కష్టసాధ్యమనీ తెలుసుకున్నారు రాజుగారైన దేశపతి ప్రజలకి సవినయంగా. దేశాన్నిమార్చడానికి కొంత కాలం పడుతుందనిన్నూ దానికి ప్రజాకే సహకరించాలనిన్నూ విన్నవించుకున్నారు. "సరే" అని ప్రజలు మళ్ళీ తియ్యటి అబద్ధాల మధ్య హాయిగా వుండసాగారు.

ఇంతలో దేశపతిగారి ఏకైక పుత్రుడూ యువరాజు అయిన వెలుగు వర్మ విజృంభించాడు. అధికారాన్ని తానుకూడా అనుభవించే అనుభవాన్ని సంపాదిస్తే భవిష్యత్తులో తాను రాజైనప్పుడు సులువుగా వుంటుందని భావించి వీలైనంత అధికారాన్ని వీలైనచోట అనుభవించ సాగాడు.

దేశపతి మహారాజుగార్కి బెంగ పట్టుకుంది. పాతరాజు ఇంద్రవర్మలా తాను కూడా కొడుకు కారణంగా పదవీచ్యుతుడవుతానేమోనని ఖంగారు పడసాగారు.

రాత్రింబవళ్ళు ఆలోచించి ఆలోచించి చివరికి యువరాజు వెలుగు వర్మను విదేశాలకు పంపించి వేశాడు.

వెలుగు వర్మ విదేశాలలో నిజంగా సుఖంగా జీవించసాగాడు. కొడుకు గండం నుంచి బైటపడ్డ దేశపతి మహారాజుగారు నిశ్చింతగా పరిపాలన కొనసాగించ సాగారు.

ప్రజలు కూడా యువరాజు బాధ ఈసారి లేదని నిట్టూర్చి మళ్ళీ తియ్యటి ప్రజా సంక్షేమం లాంటి అబద్ధాల మధ్య హాయిగా జీవించ సాగారు.

ఇంతలో - మహారాజుగారి ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. తన తదనంతరం ఆ సింహాసనాన్ని యువరాజు వెలుగు వర్మకి అప్పజెప్పాలనే కోరికతో ఆయన విదేశాలలో వున్న అతనికి స్వదేశానికి తిరిగి రమ్మని కబురు చేశారు.

"నాయనా! నువ్వింతకాలం దేశంలో లేకపోవడంవల్ల నేను హాయిగా రాజ్యం చేశాను. నేను వెళ్ళిపోతున్నాను. నువ్వొచ్చి హాయిగా రాజ్యం ఏలుకో" అని తండ్రివద్దనుంచి వచ్చిన వర్తమానానికి యువరాజు వెలుగువర్మ "నువ్వు రాజ్యం ఏలినంతకాలం నేను విదేశాల్లో హాయిగా జీవించాను. ఇంద్రవర్మలాగే నువ్వూ దేశాన్ని ఏమీ మార్చలేకపోయావు. నేను మాత్రం ఏం చేస్తాను. ఇక్కడే హాయిగా వుంటాను" అని తిరిగి సందేశం పంపించి విదేశాల్లో హాయిగా వుండిపోయాడు.

[నీతి:- కొందరు మంత్రుల పిల్లలు విదేశాల్లో హాయిగా వున్నారు.]

— తంబు